ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
గురువారం 18 జూలై 2024



రుణమాఫీకి వేళాయె..



- నేటి నుంచి రైతు రుణ ఖాతాల్లో డబ్బులు
- ఇప్పటికే మార్గదర్శకాలు జారీ
- తొలి విడత రూ.లక్షలోపు మాఫీ
- కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు
- రైతు వేదికల వద్ద సంబరాలకు ఏర్పాట్లు
- సమీక్షించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- జిల్లాలో మొదటగా 23,779 మంది రైతులకు లబ్ధి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీకి ఆదేశాలు జారీ చేసింది. రూ.2 లక్షల రుణమాఫీ అమలుకు ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం రుణమాఫీ అందుకునే రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఆగస్టు 15లోగా రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.2 లక్షల రుణమాఫీ హామీలో మొదటగా గురువారం లక్ష రూపాయల వరకు రైతుల రుణ ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి ఏర్పాట్లు చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 60 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రుణమాఫీలో మొదట జిల్లాలోని 23వేల 779 మందికి లక్ష లోపు రుణమాఫీ కానుంది. దీనిపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం సమీక్ష సమావేశంలో నిర్వహించారు. రైతుల రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల క్రితమే మార్గదర్శకాలను జారీ చేసింది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. 2023 డిసెంబరు 9 నాటికి అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు మాఫీ ఉంటుంది. రేషన్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ ప్రామాణికంగా తీసుకొని కుటుంబానికి రూ.2 లక్షలు మాఫీ చేస్తున్నారు. రూ.2 లక్షల రుణం కంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని బ్యాంక్‌కు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. రీ షెడ్యూల్ చేసిన రుణాలు, దీర్ఘకాలిక రుణాలకు రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటిం చింది. రుణ మాఫీపై రైతులకు ఉన్న సందేహాలు తీర్చడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రైతులు తమ ఇబ్బందులను ఐటీ పోర్టల్ ద్వారాగానీ మండల స్థాయిలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల ద్వారా గానీ తెలపాల్సి ఉంటుంది. రైతుల అభ్యర్థనకు 30 రోజుల్లోగా పరి ష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టారు.

● కుటుంబానికి రూ.2 లక్షలు మాఫీ

ప్రభుత్వం అందిస్తున్న రైతు రుణమాఫీలో ఒక కుటుంబానికి రూ.2 లక్షలు వర్తించే విధంగా మార్గదర్శ కాల్లో పేర్కొన్నారు. కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రైతు కుటుం బాన్ని రేషన్ కార్డు ద్వారా నిర్ధారించడంలో అయోమయ పరిస్థితి కనిపిస్తుంది. ఐదేళ్ల నుంచి రేషన్ కార్డులు మంజూరు కావడం లేదు. ఈ నేపథ్యంలో కుటుంబాలు విడిపోయి వివాహాలు చేసుకొని, వేర్వేరుగా ఉంటూ వ్యవసాయ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న సన్న, చిన్న కారు కుటుంబాలకు చెందిన రైతులను ఏ విధంగా గుర్తిస్తారనే సందిగ్ధం నెలకొంది. కుటుంబంలో మహిళల పేరుమీద తీసుకున్న రుణాలను మాఫీ చేసి తరువాత పురుషులకు సంబంధించి మాఫీ చేయ నున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, డీసీసీబీలను నుంచి తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించనుంది. ఇప్పటికే రుణాలకు సంబం ధించిన వివరాలు బ్యాంకుల ద్వారా ప్రభుత్వానికి వెళ్లాయి. మొదటి విడతలో మెజార్టీగా రుణమాఫీ ఫలాలు అందుతాయని భావిస్తున్నారు.

● గతేడాది రూ.702.36 కోట్ల రుణాలు

జిల్లాలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 61,234 మంది రైతులు రూ.702.36 కోట్ల వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. ఇందులో మొదటి దశగా 23 వేల 779 మందికి రుణమాఫీ జరగనుంది. ప్రభుత్వం లక్ష లోపు రుణమాఫీ హామీ ఇచ్చి నాలుగు విడతలుగా మాఫీ ప్రక్రియ చేపట్టారు. 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2018 డిసెంబరు 11వ తేదీ వరకు రుణం తీసుకున్న వారికి వర్తింపజేశారు. తొలి విడతలో రూ.25 వేల లోపు ఉన్నవారికి మాఫీ చేశారు. రెండో విడతలో రూ.50 వేల లోపు ఉన్నవారికి, మూడో విడతలో రూ 50 నుంచి లక్షలోపు ఉన్నవారికి మాఫీ చేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదని, రైతుల వడ్డీకే సరిపోయిందనే విమర్శలు వచ్చాయి. జిల్లాలో గతప్రభుత్వ హయాంలో 61,773 మంది రైతులు లక్ష రుణమాఫీకి అర్హులుగా ప్రకటించి మాఫీ చేశారు.

● సంబరాలకు సన్నద్ధం

ప్రభుత్వం రైతుల పంట రుణాల మాఫీ చేస్తున్న నేపథ్యంలో మొదటివిడత మాఫీ సందర్భంగా గురువారం జిల్లాలోని రైతు వేదికల వద్ద సంబరాలు నిర్వహించనున్నారు. రైతు వేదికల వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశం వినిపించనున్నారు. జిల్లాలో ప్రతీ రైతు వేదిక వద్ద 200 మంది రైతులను సమీకరించ నున్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామాల్లో సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతు వేదికల వద్ద ఏర్పాట్లు

- గ్రామ పంచాయతీల వద్ద రుణ మాఫీ జాబితాలు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం అమలుకు సంబంధించిన కార్యక్రమాలను రైతు వేదికల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టరేట్ నుంచి బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వేములవాడ మండలం మారుపాక, చందుర్తి మండల కేంద్రం, బోయినపల్లి మండలం కొదురుపాక, కోనరావుపేట మండలం నిజామాబాద్, వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట, తంగళ్లపల్లి మండలం తాడూర్, గంభీరావుపేట మండలం నర్మాల, ముస్తాబాద్ మండలం బందనకల్, సిరిసిల్ల మండలం చంద్రంపేట, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, వీర్నపల్లి, రుద్రంగి, ఇల్లంతకుంట మండల కేంద్రాల్లోని రైతు వేదికల ద్వారా కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాల వద్ద రైతు రుణమాఫీ వివరాల జాబితాలు ప్రదర్శిం చాలని ఆదేశించారు. రుణమాఫీ పొందే రైతులు వారి గ్రామాల్లోని ప్రదేశాల వద్ద జాబితా సరిచూసుకోవాలని కోరారు. రైతు వేదికల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు సందేశం ఇవ్వనున్నారని, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ కోరారు.



రుణమాఫీ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వెల్లివిరిసిన మతసామరస్యం

- భక్తిశ్రద్ధలతో మొహర్రం ● పీరీల నిమజ్జనం



సిరిసిల్లలో పీరీల ఊరేగింపు

త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకల్లో మతసామరస్యం వెల్లివిరిసింది. మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా తరలివచ్చిన ప్రజలు పీరీల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

6లో..

మహాలక్ష్మి ఆలయంలో అఖండ భజన



అఖండ భజనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, జూలై 17: చందుర్తి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో అఖండ భజన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ప్రారంభించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా 24 గంటల అఖండ భజన బుధవారం ఉదయం ప్రారంభమై నిర్విరామంగా గురువారం ఉదయం వరకు కొనసాగించనున్నట్లు మహాలక్ష్మి అలయ కమిటీ చైర్మన్ బాశెట్టి భాస్కర్ తెలిపారు. చందుర్తి మండల కేంద్రంలోని భజన మండలి, వేములవాడ మండప హనుమాన్ భజన మండలి, సిరిసిల్ల భజన మండలి సభ్యుల పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు చిర్రం తిరుపతి, చింతపంటి రామస్వామి, పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, రాజూరి రవీందర్, బాశెట్టి మొగిలయ్య, కట్కం నాగరాజు, సిరికొండ మల్లయ్య, పొంచెట్టి రాకేష్, చిలుముల గోపాలస్వామి, పోతరాజు రవి పాల్గొన్నారు.

అనువంశిక అర్చక కుటుంబాల ఆధ్వర్యంలో భజన



ఆటలు ఆడుతున్న అనువంశిక కుటుంబాల మహిళలు

వేములవాడ కల్చరల్, జూలై 17: తొలిఏకాదశి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అనువంశిక కుటుంబాల మహిళలు బుధవారం ఆటలాడుతూ భజన కార్యక్రమాలు నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో కార్యక్రమాలకు ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి భజన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల కరుణశ్రీ, ఉజ్జల అపర్ణ, గోపన్నగారి సరిత పాల్గొన్నారు.

వానొచ్చె.. ఉపాధినిచ్చె



సిరిసిల్లలో గొడుగులు రిపేరు చేస్తున్న వ్యక్తి

సిరిసిల్ల జూలై 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమైనా అంతంత మాత్రంగానే ఉండడంతో గొడుగులతో అవసరం రాలేదు. నాలుగు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇన్ని రోజులు మూలన ఉన్న గొడుగులను జనం బయటకు తీస్తున్నారు. ఇళ్లలో ఉన్న గొడుగుల మరమ్మతు చేయించుకునే పనిలో పడ్డారు. గొడుగులు రిపేరు చేసే వారికి కూడా కాస్తా ఉపాధి దొరికినట్లైంది. బుధవారం సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద ఓ వ్యక్తి గొడుగులు మరమ్మతు చేస్తూ ఇదిగో ఇలా బిజీగా కనిపించాడు.

రాజన్న ఆశీస్సులతో సుపరిపాలన

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడ సన్నిధిలో ప్రత్యేక పూజలు



ఆది శ్రీనివాస్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూలై 17: ప్రజలకు సుపరిపాలన అందించేందుకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి కృపాకటాక్షాలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా రాజన్న ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ముందుగా వినాయకుని విగ్రహం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నంది విగ్రహం వద్ద పూజలు చేసి రాజన్న సేవలో నిమగ్నమయ్యారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హైందవ సంస్కృతిలో సంప్రదాయాలకు పెద్దపీట వేయాలన్నారు. తొలి ఏకాదశితో తెలుగు పండగలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, సిరిగిరి శ్రీరాములు మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ నాయకులు కనికరపు రాకేష్, సాగరం వెంకటేష్, చిలుక రమేష్, నాగుల విష్ణుప్రసాద్, అక్కనపల్లి నరేష్, పల్లపు రాజేందర్, కూరగాయాల కొమురయ్య, తూం మధు తదితరులు ఉన్నారు.

కోతకు గురైన రహదారికి మరమ్మతు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



రహదారికి మరమ్మతు చేయిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, జూలై 17: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని వంతెన వద్ద ఇటీవల కురిసిన వర్షానికి రహదారి పక్కన కోతకు గురై ప్రమాదకరంగా మారింది. 'రహదారి కోత.. రాకపోకలకు చింత' అనే శీర్షికన ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు బుధవారం స్పందించారు. కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతు పనులు చేపట్టారు. పనులు చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

- వేములవాడకు తరలివచ్చిన భక్తులు ● ప్రత్యేక పూజలు, భజనలు ● ఆలయాల్లో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారలు

సిరిసిల్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మహా విష్ణువు క్షీరాబ్ధిలోకి శయనించే తొలి ఏకాదశి పర్వదినాన్ని జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పవిత్ర ఆధ్యాత్మిక ముక్తి ప్రద దినంగా ఉపవాస దీక్ష చేపట్టారు. బుధవారం సిరిసిల్లలోని రుక్మిణి విఠలేశ్వర స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో సిరిసిల్ల గాంధీనగర్‌లోని భక్తాంజనేయ రుక్మిణీ విఠలేశ్వర, కాలభైరవ స్వామి దేవాలయం ప్రాంగణంలో విఠలేశ్వర స్వామిదేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పండరీపూర్ పాండురంగస్వామిని సిరిసిల్లలో ప్రతిష్ఠించి ఏటా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజలతోపాటు అఖండ భజన చేపట్టారు. తొలి ఏకాదశి సందర్భంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, విశ్వనాథస్వామి దేవాలయం, హరిహర అయ్యప్ప పుత్ర దేవస్థానం, శివసాయి బాబా, హనుమాన్, రాజరాజేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేములవాడ కల్చరల్: వేములవాడరాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణి విఠలేశ్వర స్వామివారలకు ఉదయం పంచోపనిషత్ ద్వారా అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు మహాపూజ వంటివి చేశారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం తెల్లవారు జామున 6 వరకు అఖండ భజనతో పలువురు కళాకారులు అలరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు.

● తొలిఏకాదశి సందర్భంగా పట్టణ ప్రజలతోపాటుగా ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఇల్లంతకుంట: హిందువుల తొలిపండుగ తొలిఏకాదశి నిర్వహించారు. మండలంలోని జంగమరెడ్డిపల్లె, ఇల్లంతకుంట, అనంతగిరి, గాలిపెల్లి, రేపాక, వల్లంపట్ల తదితర గ్రామాల్లోని ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.



మహాపూజ నిర్వహిస్తున్న అర్చకులు



సిరిసిల్లలో ప్రత్యేక పూజలు



రుక్మిణి విఠలేశ్వరస్వామి



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



సిరిసిల్లలో అఖండ భజన



వేములవాడలో..

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జూలై 17: మండలంలోని రాగినేడుకు చెందిన నక్క కొమురయ్య (85) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నినెలల క్రితం కొమురయ్య భార్య రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఒంటరి తనాన్ని భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కూతురు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, జూలై 17: కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ మండలం అగ్రహారం గ్రామ శివారులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రహారం నుంచి నంది కమాన్ వైపు ద్విచక్ర వాహనంపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధనుంజయ్, పఠాన్ అనే ఇద్దరు వ్యక్తులు వెళుతుండగా కారు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ధనుంజయ్, పఠాన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ధర్మారం, జూలై 17: మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన కారుపూరి రాజ్‌కుమార్ (20) అనే యువకుడు బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజ్‌కుమార్ మద్యానికి, సిగరెట్లుకు బానిసయ్యాడు. గమనించిన తండ్రి మొగిలి సిగరెట్లు, మద్యం తాగడం మానెయ్యమని మందలించాడు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్లు, నాటు కోళ్లు అపహరణ

కోనరావుపేట, జూలై 17: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన గొర్లు, రామన్నపేట గ్రామానికి చెందిన మరో రైతు నాటుకోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల భూమయ్య అనే రైతుకు చెందిన లక్ష రూపాయల విలువల గొర్లు, రామన్నపేట గ్రామానికి చెందిన భూమయ్యకు సంబంధించిన 25 నాటు కోళ్లను తమ పొలం వద్ద ఉంచారు. మంగళవారం రాత్రి ఆటోలో వచ్చి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నట్లు తెలిపారు.

ఓసీపీ-2లో ఇద్దరు కార్మికుల సజీవ సమాధి

- మరో ఇద్దరు కార్మికులకు గాయాలు





గాయపడిన ఎర్ర శ్రీనివాసురాజ్, మాదాం సమ్మయ్య, బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

రామగిరి, జూలై 17: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2లో ఇద్దరు కార్మికులు సజీవ సమాధి అయ్యారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లో ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం సెకండ్ షిఫ్టులో క్వారీలోని హైవాల్ వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేస్తుండగా ఒకేసారి మట్టి కూలింది. ఈ ఘటనలో సింగరేణి టెక్నీషియన్(ఫిట్టర్) ఉప్పుల వెంకటేశ్వర్లు(58), జనరల్ మజ్దూర్ కార్మికుడు గాదం సాగర్(55) మట్టిలో కూరుకుపోయి సజీవ సమాధి అయ్యారు. మరో ఇద్దరు జనరల్ మజ్దూర్ కార్మికులు శ్రీనివాస్‌రాజ్, మాదాం సమ్మయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. క్వారీలోని సౌత్ కోల్ ఏరియాలో సైడ్‌వాల్ లోపల పైప్ లీకేజీ మరమ్మతులు చేస్తుండగా అకస్మాత్తుగా వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌లపై హైవాల్‌లో బురద మట్టి(ఓబీ) వర్షానికి నాని పెద్దమొత్తంలో కూలింది. దీంతో వారు సజీవ సమాధి అయ్యారు. అక్కడే పనిచేస్తున్న శ్రీని వాస్ రాజ్, మాదాం సమ్మయ్యలపై కూలిన మట్టిలో వచ్చిన బండరాళ్లు తగల డంతో తీవ్రంగా గాయపడ్డారు. క్వారీలోని మిగతా కార్మికులు ఘట నా స్థలానికి చేరుకొని కూలిన మట్టిని షావల్ సహాయంతో తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గాయపడిన కార్మికులను తొలుత స్థానిక సెంటినరీకాలనీలోని డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అందించి తర్వా త గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఉప్పుల వెంకటేశ్వర్లు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన వ్యక్తి కాగా గాదం విద్యాసా గర్ గోదావరిఖనికి చెందిన వ్యక్తి. మృతదేహాలను గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి మార్చూరీకి తరలించారు.




ఉప్పుల వెంకటేశ్వర్లు(ఫైల్), జి విద్యాసాగర్(ఫైల్)

● ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2లో కక్ష సాధింపులు ఎక్కువగా జరుగుతు న్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వెంకటేశ్వర్లును కక్ష సాధింపు ధోరణిలో భాగంగానే షిఫ్ట్ మార్పు చేపట్టారనే ఆరోపణలు వ్యక్తం అవుతు న్నాయి. పంప్ సెక్షన్‌కు మార్పు చేయ డం మూలంగానే ఈ ఘటనకు ఆస్కారం ఏర్పడిందని కార్మికనేతల నుం చి బలంగా వినిపిస్తోంది. షిఫ్టు మార్పుతోనే ఇటీవల ఆంజనేయులు గుండెపోటుతో మృతి చెందినట్లు సింగరేణిపై ఆరోపణలు ఉన్నాయి. వరు స ప్రమాదాలకు సింగరేణి బాధ్యత వహించాలని యూనియన్ నాయకు లు డిమాండ్ చేస్తున్నారు.

● బాధిత కుటుంబాలకు పరామర్శ..

సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం హైవాల్ కూలిన ప్రమాదంలో సజీవ సమాధి అయిన ఉప్పుల వెంకటేశ్వర్లు, గాదం విద్యాసాగర్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి ధైర్యం చెప్పారు. గాయపడిన శ్రీనివాస్‌రాజ్, మాదం సమ్మయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో యూనియన్ నాయకులు గౌతం శంకరయ్య, ఎంఆర్‌సీ రెడ్డి, యాదగిరి సత్తయ్య, ఆరకాల ప్రసాద్, కోట రవీందర్‌రెడ్డి, కుమార్, కార్మికులు ఉన్నారు.

24 గంటల వ్యవధిలో భార్యాభర్తల మృతి

- మానకొండూర్ మండలం బంజెరుపల్లిలో విషాదం

మానకొండూర్, జూలై 17: కష్టసుఖాల్లో భార్యాభర్తలు కలిసిమెలిసి బతికారు.. ఒకరిని విడిచి ఒకరు ఉండలేక 24 గంటల వ్యవధిలో ఇద్దరూ మృతి చెందారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని కొండపల్కల శివారు గ్రామమైన బంజెరుపల్లిలో భర్త మృతిని తట్టుకోలేక భార్య హఠాన్మరణం చెందింది. కొండపల్కల శివారు గ్రామం బంజెరుపల్లికి చెందిన తోట మల్లయ్య (75) అనే వృద్ధుడు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా బుధవారం మల్లయ్య అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా భార్య తోట రాజలచ్చమ్మ (70) భర్త మృతిని తట్టుకోలేక హఠాన్మరణం చెందింది. బుధవారం సాయంత్రం భార్యాభర్తల అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇద్దరి మృతితో పండుగపూట గ్రామంలో విషాదం నెలకొంది.



తోట మల్లయ్య, రాజలచ్చమ్మ(ఫైల్)

పిచ్చికుక్కల దాడిలో 20మందికి గాయాలు

హుజూరాబాద్, జూలై 17: హుజూరాబాద్ పట్టణంలోని పలు వీధుల్లో బుధవారం పిచ్చి కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని విద్యానగర్, గాంధీనగర్, ప్రతాపవాడ, మామిండ్లవాడ, కిందివాడ తదితర కాలనీల్లో వీధి కుక్కలు ఎక్కువయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న బాటసారులను గాయాల పాలు చేస్తున్నాయి. పట్టణంలో 20మందికి కుక్కల దాడిలో గాయాలు కాగా వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

వీణవంక, జూలై 17: మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన మడిపల్లి మొగులయ్య (68) అనే వృద్ధుడిని ట్రాక్టర్ ఢీకొనగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. మొగులయ్య మంగళవారం రాత్రి సొంత పనిమీద శ్రీరాములపేట గ్రామానికి వెళ్ళి తిరిగి వస్తున్నాడు. మార్గం మధ్యలో నర్సింహులపల్లి గ్రామానికి చెందిన వంతడుపుల సమ్మయ్య తన ట్రాక్టర్‌తో వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో మొగులయ్యకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో హుజురాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కూమారుడు మడిపల్లి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

మల్యాల, జూలై 17: బహిర్భూమికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు వరి పొలంలో జారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముత్యంపేటకు చెందిన మల్యాల గంగాధర్(40)అనే వ్యక్తి బుధవారం తోటి మిత్రులతో కలిసి కొండగట్టు సమీపంలోని మారుతీ టౌన్ షిప్ వద్ద విందు చేసుకున్నారు. అనంతరం కాసేపటికి బహిర్భూమికి వెళ్లి అక్కడి నుంచి వరి పొలం వద్దకు వెళ్లగా అక్కడ ప్రమాదవశత్తూ కాలు జారి పొలంలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

భీమారం, జూలై 17: భీమారం మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన తిపిరి శ్రావణి(27) అనే వివాహిత బుధవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో శ్రావణి బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన భర్త నరేష్ స్థానికుల సహాయంతో హుటాహుటిన జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు శ్రావన్స్(4), రుద్రాన్ష్(1) ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అప్పటివరకు అందరితో కలివిడిగా ఉన్న శ్రావణి క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం తన ఇద్దరు పిల్లలతో పాటు కుటుంబీకులకు కడుపుకోతను మిగిల్చింది.



శ్రావణి(ఫైల్)

గంజాయి నిందితుడి అరెస్ట్

వేములవాడ టౌన్, జూలై 17: ఆరు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న గంజాయి నిందుతుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 31వ తేదీన గంజాయితో పట్టుబడ్డ సాయికుమార్, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, రమేష్‌లను విచారించారు. దీంతో సదరు నలుగురు వ్యక్తులు మరో నలుగురు అమీర్, వెంకటేష్, అభి, రవిల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో అమీర్, వెంకటేష్, అభి, రవిలను విచారించగా చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో పోలీసులకు తెలిపారు. ఈ మేరకు అందరిపై కేసు నమోదు చేశామని అప్పటి నుంచి పరారీలో వున్న తోట అఖిల్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 4,468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.833 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 22.866 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 436 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 8.212 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.898 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో యువకుడి ఆత్మహత్యాయత్నం



చందుర్తి జూలై 17: గంజాయి కేసు విషయంలో పోలీసులు తనను అన్యాయంగా తీసుకొచ్చారని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో యువకుడు బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఏడాది జనవరిలో వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై నమోదైన గంజాయి కేసులో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి అఖిల్ పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నారు. అఖిల్ గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. వారు వేములవాడకు తరలించేందుకు సిద్ధమవ్వగా తన వద్ద ఉన్న బ్లేడ్‌తో అఖిల్ ఎడమ చేతిపై, కుడి కాలుపై కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. చికిత్స నిమిత్తం చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అఖిల్ మాట్లాడుతూ పోలీసులు తనను అన్యాయంగా పట్టుకొచ్చారని, అందుకనే చేయి, కాలుపై బ్లేడుతో కోసుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆత్మహత్యకు యత్నించిన తోట అఖిల్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మస్కట్‌లో యువకుడి ఆత్మహత్య

- మృతదేహాన్ని స్వగ్రామం తెప్పించాలని వేడుకోలు

వేములవాడ టౌన్, జూలై 17: వేములవాడ రూరల్ మండలం అచ్చనపల్లి గ్రామానికి చెందిన యువకుడు మస్కట్ (ఓమన్)లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మాదాసు విజయ్(33) అనే యువకుడు నాలుగు సంవత్సరాలుగా మస్కట్ దేశానికి ఉపాధి నిమిత్తం వెలుతూ వస్తున్నాడు. ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లిన విజయ్ ఈ నెల 13వ తేదీన తను ఉంటున్న రూమ్‌లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతోనే మృతి చెందినట్లు పలువురు చెప్పగా మస్కట్‌లో ఓ ఆంధ్రా అ మ్మాయితో పరిచయం అయిందని, ఆమెతో కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడని వారి ఇద్దరి మధ్య మాట మాట పెరిగి ఆత్మహత్య చేసుకునేందుకు దారి తీసిందని గ్రామస్థులు చెబుతున్నారు. చేతికి అందిన కొడుకు ఏడారి దేశంలో మృతి చెందడంతో మృతుడి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజయ్ తల్లిదండ్రులు దేవయ్య, మంజుల వేడుకుంటున్నారు.



విజయ్ (ఫైల్)

ఒకే గదిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు



ముత్యంపేటలో ఒకే గదిలో కూర్చున్న మూడు అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు, టీచర్లు

మల్లాపూర్, జూలై 17: మాతా శిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం నుంచి ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు వయసున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీసం సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఒకే గదిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను టీచర్లు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిచండానికి స్వంత భవనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్వంత భవనాలు లేని కేంద్రాలకు ప్రతి నెలా రూ. వెయ్యి చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కనీస సౌకర్యాల్లేని ఒక అద్దె గదిలో కొనసాగుతున్న దానిలో మూడు కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి అద్దె గదిలోనే సామగ్రిని భద్రపర్చడం, ఒక పూట భోజనం వండి పెట్టడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడం వంటి పనులన్నీ ఒకే చోటే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇరుకు గదిలో చిన్నారులకు ఊపిరి ఆడని పరిస్థితి చేస్తుంది. మూత్రశాలలు, నీటి సరఫరా తదితర సౌకర్యాలు లేని ఇరుకైన అద్దె గదిలో నిర్వహిస్తున్న కేంద్రాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదని ఆరోపణాలు లేకపోలేదు. ఒక గదిలో మూడు కేంద్రాల నిర్వహన గురించి అంగన్‌వాడీ సూపర్ వైజర్ శంకరమ్మను వివిరణ కోరగా తర్వలోనే విడివిడిగా నిర్వహించెందుకు ప్రయత్నలు చేస్తున్నమన్నారు. కేంద్రాలను నిర్వహించడానికి తగిన గదులను పరిశీలిస్తున్నమని, విద్యార్థులకు గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు.

తల్వార్‌తో విన్యాసాలు చేస్తున్న యువకుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 17: ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ తల్వార్, కత్తులతో విన్యాసాలు చేస్తున్న సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన తోటిచర్ల సాయివర్ధన్(22) అనే యువకుడిని బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. విన్యాసాలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రాంలో అప్‌లోడ్‌చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే అతనిపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశామని సీఐ తెలిపారు. యువకుడి వద్ద తల్వార్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఒప్పంద కార్మికుల నిరసన

వేములవాడ కల్చరల్ , జూలై 17: రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు రాజన్న ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జూన్ నెలకు సంబంధించిన వేతనం ఇంతవరకు తమకు చెల్లించలేదని 40 మంది కార్మికులు సుమారు అరగంటసేపు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. శానిటేషన్, గోశాల, ఇంజనీరింగ్ విభాగాల చెందిన కార్మికులు తమ వేతన చెల్లింపులో జాప్యం జరిగిందని నిరసన వ్యక్తం చేయగా విషయం తెలుసుకున్న ఈవో వినోద్ రెడ్డి సంబంధిత ఏజెన్సీలను మందలించినట్లు తెలిసింది. ఇకపై ప్రతినెల 10 తేదీ లోపు వేతనం వచ్చేలా చూస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసనను విరమింపచేసినట్లు ఈవో తెలిపారు.

ఊపందుకున్న వరినాట్లు

- గంగాధరలో 13.5 సెం.మీ వర్షపాతం నమోదు

- పత్తికి ప్రతికూలం.. వరికి అనుకూలం

గంగాధర, జూలై 17: మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని రోజులుగా వర్షానికై ఎంతో ఆశతో ఎదురు చూసిన రైతన్నలకు రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి సంతోషం వ్యక్తం చేశారు. సాగునీటి కోసం తండ్లాడిన రైతులకు వర్షానికి పొలాల్లో నిలిచిన నీటిని వినియోగించుకున్నారు. నీరు భూమిలోకి ఇంకక ముందే గంగాధర, కురిక్యాల, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, ఉప్పరమల్యాలతో పాటు పలు గ్రామాల్లో రాత్రి నుంచి తెల్లారే వరకు మడులను ట్రాక్టర్లతో దున్నించారు. దీంతో పది రోజులుగా నాట్లకు వచ్చిన నారు వేయడానికి సిద్ధమవడంతో రైతులు కూలీలను వెదకే పనిలో పడ్డారు. మరో వైపు ఎడతెరిపిలేకుండా రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పొలం గట్టన్నీ తెగిపోయాయి. గంగాధర మండలంలో 13.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బావుల్లో అడుగునున్న నీరు వర్షంతో క్రమక్రమంగా పెరుగుతోం ది. మండలంలో కురిసిన వర్షం పత్తికి ప్రతికూలంగా మారింది. పత్తి రెండో దశ కలుపు తీయడానికి సిద్ధంగా ఉండి వర్షం లేక భూమి ఎండి పోవడంతో కలుపు తీయడానికి వీలుపడలేదు. పత్తిలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు రైతులను కలవర పెట్టింది. ఇటీవల కురిసిన వర్షంతో చుట్టుపక్కల మండలాల నుంచి పత్తి కలుపుతీయడానికి కూలీలను రప్పిస్తున్నారు. వర్షం పత్తి రైతుకు ఎంతో ఉపయోగడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వరకు భూమిలో పదను ఉండనుండగా కూలీలు ఎప్పుడు దొరికితే అప్పుడు కలుపు తీయించి అడుగు మందుకు వేయడానికి రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇక వరి నాట్లు వేయడానికి మండలంలో పలు గ్రామాల్లో బీహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ నుంచి వచ్చిన కూలీలు పనుల్లో పూర్తిగా బిజీగా ఉండి నాట్లు వేయడానికి రైతులకు తేదీలను ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో స్థానిక కూలీలకు పని అడపదడపా లభిస్తుండగా, వారి పద్ధతిలోనే ఇక్కడి కూలీలు ఎకరాకు గుత్తగా మాట్లాడుకుని నాట్లు వేస్తున్నారు. దీంతో రైతుకు నాట్లు వేయడాని గతంలో మాదిరిగా వరి పరచడానికి మగ కూలీ తప్పింది. పదిహేను రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు మండలంలో కురిసిన భారీ వర్షంతో సంతోషం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



లక్ష్మీదేవిపల్లిలో నాట్లు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- ● సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- ● పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ● దోమలు పెరగకుండా చూసుకోవాలి
- ● గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

వెల్గటూర్, జూలై 17: దోమలు చిన్నవే కానీ వాటి వలన వచ్చే జబ్బులు మాత్రం పెద్దవే. వర్షాకాలం ప్రారంభం అయిందంటే దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. తద్వారా వ్యాధులు కూడా అంతే మొత్తంలో వ్యాప్తి చెందుతాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వలన దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలతో ఆసుపత్రులకు చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వానా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు. సీజనల్ వ్యాధులకు కారకమైన దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ఎవరికి వారే ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిలువ ఉండకుండా చూడడం, మురుగు నీరు రాకుండా చూసుకోవడం అత్యంత ఆవశ్యకం. దోమకాటుతో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా, జికా వైరస్, మెదడు వాపు, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధులపై గ్రామాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, వెల్గటూర్, వైద్య శాఖ అధికారులు గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

● డెంగీతో పొంచి ఉన్న ప్రమాదం..

సీజనల్ వ్యాధుల్లో ప్రమాదకరమైనది డెంగీ. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వలన డెంగీ వ్యాధి వస్తుంది. డెంగీ వ్యాధి ప్లైవీ అనే సూక్ష్మజీవి ద్వారా వ్యాపిస్తుంది. డెంగీకి కారణమైన దోమ నల్లగా ఉండి మచ్చలు ఉంటాయి. ఇది పగటి పూట మాత్రమే కుడుతుంది. ఈ దోమ కుట్టిన నాలుగు నుండి పది రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయట పడతాయి. ఈ దోమ కుట్టడం వలన రక్త కణాల సంఖ్య పడిపోయి ఒక్కోసారి మరణం వరకు దారి తీస్తుంది. ముందు జాగ్రత్త అవసరమని ఎవరికి వారు స్వంత వైద్యం చేసుకోవద్దని వైద్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మూతలు లేని నీటి ట్యాంకులు, రోడల్లపై నిలిచే మురుగు నీరు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఇనుప డబ్బాలు, పగిలిన కుండీలు, కూలర్లలో నిలువ ఉండే నీటిలో డెంగీ కారక దోమలు పెరుగుతాయి. ఒక్కో డెంగీ దోమ మూడు సార్లు గుడ్లు పెడుతుంది. ఒక్కో సారి 300 చొప్పున మొత్తం 900 గుడ్లు పెడుతుంది. దాదాపు ఆరు నెలల వరకు గుడ్లు ఉంటాయి. ఒక్క సారి నీరు తగలగానే లార్వా ఉత్పత్తి జరిగి డెంగీ దోమగా రూపాంతరం చెందుతుంది. ఈ దోమలు పూర్తి స్థాయిలో వ్యాపించకుండా ఉండాలంటే నీరు నిలువ ఉండకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఉమ్మడి మండలంలో డెంగీ కేసులు..

ఉమ్మడి వెల్గటూర్ మండలంలో ఇప్పటి వరకు మూడు డెంగీ కేసులు నమోదు అయినట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. ఎండపల్లిలో ఇద్దరికి, పాతగూడూర్‌లో ఒక్కరికి డెంగీ జ్వరం సోకినట్లు అధికారికంగా ప్రకటించినప్పటికీ అనధికారికంగా ఈ సంఖ్య ఎక్కువగానే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రైవేట్ ఆసుపత్రుల్లో జ్వరంతో చేరుతున్న వారి సంఖ్య ఈ మధ్య కాలంలో అధికంగా ఉంటోంది. గ్రామాలలో ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద కూడా జ్వర బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. కాగా డెంగీ పాజిటివ్ వచ్చిన వారి ఇళ్లను జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఏఎంవో సత్యనారాయణ, మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్‌లు పరిశీలించి పైరిత్రిమ్‌ను స్ప్రే చేయించారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

● అప్రమత్తత అవసరం

- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత చాలా అవసరం. ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడడం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు.

మతిస్థిమితం లేని యువతిపై దాడి

- స్తంభానికి కట్టేసి కొట్టిన దుకాణాల యజమానులు

సిరిసిల్ల టౌన్, జూలై 17: మానవత్వం మరిచారు.. మతిస్థిమితం లేని యువతి అని తెలిసి కూడా చాక్లెట్లు దొంగతనం చేసిందని కట్టేసి కొట్టారు. దెబ్బలకు తాళలేక బక్కచిక్కిన ఆ యువతి అల్లాడినా వారి మనస్సు మాత్రం కరగలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న సంఘటన అక్కడున్న వారిని కలిచివేసింది. స్థానికుల వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేటకు చెందిన జగిత్యాల శిరిషా పుట్టుకతోనే మతిస్థిమితం సరిగా ఉండేది కాదు. కొన్ని నెలలు క్రితం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా కొంచెం ఆరోగ్యం కుదటపడడంతో తిరిగి సిరిసిల్లకు తీసుకొచ్చారు.. బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న ఓ పాన్‌షాప్‌లోని డబ్బాలో ఉన్న చాక్లెట్లు తీస్తుండగా షాప్ యజమాని పట్టుకున్నాడు. దీంతో యువతి తప్పించుకోవడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న కూరగాయాలు అమ్మే ఓ మహిళ, చికెన్ సెంటర్ యజమాని, మరో వ్యక్తి పట్టుకున్నారు. రాళ్లతో దాడి చేస్తుందని అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి విచక్షణ రహితంగా కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక యువతి అల్లాడింది. అక్కడ ఉన్న జనం పోగయ్యారు. యువతి గురించి తెలిసినవారు ఆమెకు మతిస్థిమితం లేదు వదిలేయాలని చెప్పారు. అయినా మతిస్థిమితం లేని యువతిపై దాడి చేయడాన్ని చూసిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటన స్థలా నికి చేరుకున్న పోలీసులు యువతిని విడిపించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు.



శిరీషను విద్యుత్ స్తంభానికి కట్టేసిన దుకాణాల యజమానులు

బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్‌కు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గరిపెల్లి అశోక్

సిరిసిల్ల రూరల్, జూలై 17: ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ బుధవారం పెండం జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గరిపెల్లి అశోక్‌కు పెండం జగదీశ్వర్ పేరుతో అందిస్తున్న జాతీయ పురస్కారంతోపాటు రూ.5 వేల నగదు, ప్రశంసపత్రాన్ని అందజేశారు. 2018 నుంచి పెండం జగదీశ్వర్ స్నేహితులు అందిస్తున్న ఈ పురస్కారానికి 2024లో గరిపెల్లి అశోక్‌కు లభించింది. ఈ సందర్భంగా జాతీయ పురస్కారం అందుకున్న గరిపెల్లి అశోక్‌ను సిరిసిల్ల మానేరు రచయితల సంఘం సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, బాల సాహితీవేత్తలు మేరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ అమ్మినా శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌కు సన్మానం



చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

బోయినపల్లి, జూలై 17: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నెరేళ్ల శారదను కాంగ్రెస్ నాయకులు బుధవారం సన్మానించారు. శారద మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించగా, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడు ఏటి యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, నాయకులు ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 17: జిల్లాలో గురువారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోటు హుస్సేన్ పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన వేములవాడకు చేరుకుంటారు. రాజరాజేశ్వరస్వామి దర్శనం అనంతరం కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు కలెక్టర్, ఎస్పీ, ఇతర జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



గొల్లపల్లిలో జయంతి నిర్వహిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జూలై 17: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని రాచర్ల ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు రవి, బాలయ్య, శంకర్, అంజయ్య, శ్రీను, శివకుమార్, చారికుమార్, భాను, హర్షవర్ధన్, కార్తీక్ పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

గంభీరావుపేట, జూలై 17 : గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కాలనీలో పిట్ల వెంకటి అనే కాంగ్రెస్ నేత సొంత ఖర్చులతో బుధవారం వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. ఇటీవల షార్టు సర్క్యూట్‌తో విద్యుత్ స్తంభాలకు ఉన్న లైట్లు కాలిపోయాయి. దీంతో రాత్రి పూట ప్రజలు అవ ఏదైన అవసరం ఉండి రాత్రి బయటకు వెళ్లాలంటే అందకారం తలపిస్తుండటంతో కాంగ్రెస్ నేత పిట్ల వెంకటి వీధి లైట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాడు. విద్యుత్ పోల్‌కు లైట్ ఏర్పాటుకు పిట్ల వెంకటి తన సొంత డబ్బును వెచ్చించారు. గ్రామంలో వీధి లైట్ లేని పోల్‌కు లైటును పెట్టించి, గ్రామంపై ఉన్న ప్రేమను చాటారు. గతంలో కూడ వెంకటి గ్రామంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టిన సందర్భాలు ఉన్నాయి.

వీహెచ్‌పీ కార్యకర్తల సమావేశం

ధర్మపురి, జూలై 17: ధర్మపురి పట్టణంలోని శ్రీకర్ని అక్కపెల్లి కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి గజం రాజ్‌కుమార్ హాజరై కార్యకర్తలకు రాబోయే కార్యక్రమాలు గురించి మార్గదర్శనం చేశారు. వీహెచ్‌పీ స్థాపించి 60 ఏళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా దేశంలోని అన్ని ప్రఖండాల్లో సమ్మేళనాలు నిర్వహించాలని కేంద్రీయ సమితి సూచించినట్లు ఆయన తెలిపారు. పట్టణ, గ్రామాల్లో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సమితులను ఏర్పాటు చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. యువత హిందూ ధర్మ రక్షణ కోసం సమయం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షులుగా ముత్యపు రమేష్, ఉపాధ్యక్షులుగా పురంశెట్టి లచ్చన్న, గాదె లక్ష్మణ్, కార్యదర్శిగా వెలగందుల బుచ్చన్న, సహాయ కార్యదర్శిగా ఎడ్ల రాజేష్, సేవా ప్రముఖ్‌గా కలికోట రాజేష్, సత్సంగ్ ప్రముఖ్‌గా శీలం తిరుపతి, బజరంగ్‌దళ్ సహ సంయోజక్‌గా ఆసం సురేష్‌ను నియమించారు. అలాగే మండల వీహెచ్‌పీ అధ్యక్షులుగా మామిడాల రవీందర్, ఉపాధ్యక్షులుగా మ్యాన పూర్ణచందర్, భజరంగ్‌దళ్ మండల సంయోజక్‌గా సోమిశెట్టి సాయి ప్రసాద్, సహ సంయోజక్‌గా మల్లేశం, బీర్‌పూర్ మండల భజరంగ్ దళ్ సంయోజక్ బుస్సరాజుల సంతోష్‌ను నియమించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

- భక్తిశ్రద్ధలతో మొహర్రం
- భక్తుల మొక్కుల చెల్లింపు
- పీరీల నిమజ్జనం



గంభీరావుపేటలో మొహర్రం వేడుకలు



గొల్లపల్లిలో పీరీలతో ఊరేగింపు



దేశాయిపల్లిలో ప్రత్యేక ప్రార్థనలు

సిరిసిల్ల రూరల్, జూలై 17: సిరిసిల్ల పట్టణంలో మొహర్రం వేడుకలను కులమతాలకు తీతంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్, పెద్దబజార్, పోస్ట్ ఆఫీస్ వీధి, రాళ్లబావి, రెడ్డివాడలో బుధవారం రాత్రి పీరీలను ఊరేగించి అయా వార్డుల చౌరస్తాల్లో నిలపగా ప్రజలు అక్కడికి వచ్చి పీరీలకు ప్రత్యేక ప్రార్ధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జామా మసీద్ ఆధ్వర్యంలో వచ్చిన ప్రజలు, భక్తులకు షెర్బత్‌ను పంపిణీ చేశారు.

విలీన గ్రామాల్లో..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్దాపూర్, జగ్గారావుపల్లె, చంద్రంపేట, రగుడు, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, తుర్కాకాశీపల్లెలో పీరీలను ఊరేగించారు. అనంతరం పీరీలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్య, భూక్య రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, కల్లూరి లత, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మీ, బోల్గం నాగరాజుగౌడ్, చెన్నమనేని కీర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, తిమ్మాపూర్, హరిదాస్‌నగర్ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్ధనలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అసోయిదులా ఆటలు ఆడారు. పీరీలను డప్పుచప్పుళ్ల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం గ్రామ శివారుల్లోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

ఇల్లంతకుంట : త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇల్లంతకుంట, అనంతారం, జంగమరెడ్డిపల్లె, గాలిపెల్లి, పత్తికుంటపల్లె, తాళ్లపెల్లి గ్రామాలలో పీరీలను పురవీధులగుండా ఊరేగించారు. పీరీలను ఎత్తుకోవడానికి యువకులు పోటీపడగా భక్తులు దట్టీలు, కుడుకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా మొక్కులు చెల్లించుకున్నారు. అసోయిదుల్లా ఆటలు ఆడారు. మొహర్రం సందర్భంగా మేయిన్ రోడ్‌లో జాతర ఏర్పాటైంది.

తంగళ్లపల్లి : మండలంలోని దేశాయిపల్లె, రామచంద్రపూర్, తంగళ్లపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ హైదర్ షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సంసేర్, మెహబూబ్, హమీద్, ఉస్మాన్, హైదర్, మౌలానా సైదుర్ రహ్మాన్, అబ్దుల్ ఖదీర్, షేక్ అబుబకర్, మొహమ్మద్ సలీమ్, ఇమామ్ షేక్ అక్రమ్ రాజా, మొహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో పీరీలతో కుల మతాలకు అతీతంగా మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిదిరోజులు ప్రతిష్టించి నిత్యం పూజలు చేసి పదో రోజున పీరీలను నిమజ్జనం చేశారు. మరికొంత మంది గురువారం పీరీలను నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 17: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం సిరిసిల్ల పవర్‌లూం కార్మికులు, అనుబంధ సంఘాల కార్మికులు, ఆసాములు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి కలిశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం, కార్మికుల సమస్యలు, ఆత్మహత్యలపై అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. సిరిసిల్ల పవర్‌లూం సమస్యలను పరిష్కరించే బాధ్యతలను తాను తీసుకుంటానన్నారు. రాబోయే అసెంబ్లీ సమావే శాలలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం, కార్మికుల సంక్షేమంపై మాట్లాడతానన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు తన వంతు కృషి చేస్తానని, కార్మికులు, ఆసాములు ఆందోళన చెందవద్దని, ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి బాధ్యులైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల ప్రాంతంలో దాదాపు పది మంది నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన స్పందించక పోవడం, వారి కుటుంబ సభ్యులను కనీసం పరామర్శించకపోవడం విచారకర మన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమస్యల పరిష్కరించడానికి సానుకూలంగా ఉన్నారని, సమస్యలను పరిష్కరించకుంటే సీపీఐ పిలుపునిస్తే అసెంబ్లీ సమావేశాల సమయంలోనే హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున పవర్‌లూం కార్మికులు, ఆసాములతో కలసి ఆందోళన చేపడతామని అన్నారు.

మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 17: అన్నదాతలకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ సర్కారుదన్నారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించి నెరవేరుస్తోందన్నారు. ఈ నెల 18న రూ.లక్షలోపు రుణమాఫీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రైతును రాజు చేయడమే తమ లక్ష్యమని గొప్పలు చెప్పుకున్న అప్పటి సీఎం సకాలంలో రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురి చేశారని మండి పడ్డారు. మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ విమర్శలు మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ రుణమాఫీ చేస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని పేర్కొన్న హరీష్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలన్నారు. రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో రైతులు, నాయకులు, అధికారులు రైతు వేదికల్లో సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, రాములు, దత్తాద్రిగౌడ్, రాజేందర్, రాజునాయక్, బుచ్చాగౌడ్, రాంరెడ్డి, రఫీక్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, తిరుపతిగౌడ్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నవాబ్

ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నవాబ్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాహెబ్ బుధవారం నియామక పత్రాన్ని మండల కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా సాహెబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పాటు పడుతోందన్నారు. జిల్లాలోని మైనార్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసంతో పని చేయాలని సాహెబ్ కోరారు. తన నియామకానికి కృషి చేసిన సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్‌కు నవాబ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, దత్తాద్రిగౌడ్, రాజేందర్, రాజునాయక్, రఫీక్, రాములు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సేవలు భేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న కొండూరు రవీందర్‌రావు

ఇల్లంతకుంట, జూలై 17: రైతులకు సహకార సంఘాల మెరుగైన సేవలు అందిస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇల్లంతకుంట, గాలిపెల్లి గ్రామాలలో బుధవారం సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోలు, డీజిల్ బంకులను కేడీసీసీ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్యాక్స్ అధ్యక్షుడు రొండ్ల తిరుపతిరెడ్డి, అన్నాడి అనంతరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గతంలో సహకార సంఘాలకు ప్రాధాన్యం ఉండేది కాదని, కొంతకాలంగా వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాయని అన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు ఎరువులు, రుణాలు పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో సేవలను మరింత విస్తరించాలని సూచించారు. రాష్ట్రంలో రైతు ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పంట రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేడీసీసీబీ అధ్యక్షుడు రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో గతంలో డీజిల్ బంకులు పనిచేసినా కొన్ని ఇబ్బందులతో మూసివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇతర ఫిల్లింగ్‌స్టేషన్ల మాదిరిగా పనిచేస్తాయన్నారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేయడంతోనే నష్టాలలో ఉన్న జిల్లా సహకార బ్యాంకు రూ.100 కోట్ల లాభాలతో ముందుకు పోతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో 11 పెట్రోలు బంకులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతుల పిల్లలు విదేశాలకు వెళ్లే రుణాలు, గృహనిర్మాణ, వ్యాపార రంగ రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లను ప్రారంభించి 26 రకాలైన సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గొడుగు తిరుపతి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సీఈవోలు చిట్టి రవీందర్‌రెడ్డి, మల్లేశం, సేల్స్‌మేనేజర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల పునరుద్ధరణ సహకార వ్యవస్థకు మేలు

గంభీరావుపేట: పెట్రోల్ బంక్‌ల పునరుద్ధరణతో సహకార వ్యవస్థకు ఎంతో మేలు చేకూరుతుందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్, డీజిల్ బంక్‌ను బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించడం ఓ చారిత్రక నిర్ణయమన్నారు. దానితోనే పెట్రోల్ బంకుల పునరుద్ధరణ సాధ్యమైందన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసి పెట్రోల్, డీజిల్ బంక్‌ల పరిస్థితిని విన్నవించామన్నారు. సానుకూలంగా స్పందించి చొరవ చూపారన్నారు. కేంద్రంలో సహకార శాఖ ఏర్పాటు కావడంతో ఇదంతా సాధ్యమైందన్నారు.

ఈ కార్యక్రమంలో భారత పెట్రోలియం ఏరియా మేనేజర్ చరణజిత్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామాంజనేయులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో చైర్మన్ గుండారం కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్‌పంతులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దయాకర్‌రావు, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, సీఈవో రాజిరెడ్డి, మేనేజర్ సత్యంరావు, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు మల్యాల రాజవీర్, పురం రాజేశ్వరావు, మరళి, రాజిరెడ్డి, బీమ్లానాయక్, మాజీ సర్పంచులు రాజు, సత్యం, రాజిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో తొలి ఏకాదశి

ధర్మపురి, జూలై 17: ధర్మపురిలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు శ్రీలక్ష్మీ నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామివారలకు అభిషేకం, పంచోపనిషత్తులచే మహా క్షీరాభిషేకం, తులసీ అర్చన, విశేష పూజా, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయాల్లో అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మపురి మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగన భట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ధర్మపురి గోదావరి నదిలో బుధవారం భక్తులు స్నానాలు ఆచరించారు. సమీపంలో గల శివుడి విగ్రహాలపై నదీ జలాలు పోసి అభిషేకం చేశారు. ఆలయాల్లో స్వామివారలను అందంగా పూలతో అలంకరించారు.

అన్నదానం కోసం రూ.10 లక్షలు విరాళాలు

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానం కోసం హైదరాబాద్‌కు చెందిన బద్ధం సునీత రూ 10,00,000 విరాళాలు అందించారు. గతంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణం కోసం రెండు మంగళ సూత్రాలు అందించారు. దాతలు ఈ నెల 13న అన్నదానం కోసం రూ.5,00,000 ఈ నెల 17న రూ.5,00,000 అందించారు. మండలంలోని జైనా గ్రామానికి చెందిన సంగెం మనోజ్ ఆలయ ఆవరణలో పోగొట్టుకున్న సెల్ ఫోన్ జూనియర్ అసిస్టెంట్ దేవయ్యకు దొరికింది. వెంటనే ఆయన ఈవో శ్రీనివాస్‌కు అందించగా విచారించి భక్తుడికి అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 17 : ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కార్యాలయాలు వేదికగా నిలవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి బస్టాండ్‌లో వేములవాడ రూరల్ కాంగ్రెస్ కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంతోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరక ఉచిత విద్యుత్, రూ.500కు వంటగ్యాస్ సిలిండర్ వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ తుక్కుగూడలో రైతన్నలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే రాష్ట్రంలో ఒక చారిత్రాత్మక, సాహసోపేతమైన నిర్ణయంగా రైతు రుణమాఫీ నిలవబోతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.31వేల కోట్లు రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఒక పండగ వాతావరణం నెలకొందన్నారు. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దేశం అబ్బురపడేలా రుణమాఫీ చేసినట్లు ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోతోందని, బీజేపీ దాని స్థానాన్ని ఆక్రమించాలని చూస్తోందని అన్నారు. రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికైన తర్వాత బీజేపీ ప్రభుత్వానికి రైతులు, ప్రజల పక్షాన వేస్తున్న ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయిందన్నారు. పార్టీ రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, రంగు వెంకటేష్, సోయినేని కరుణాకర్, రొండి రాజు, పిల్లి కనుకయ్య చిలుక రమేష్, సాగరం వెంకటస్వామి, రాజేశం, నాయకులు ఉన్నారు.

నత్తనడకన పంచాయతీ భవన నిర్మాణం



కోనరావుపేటలో నిలిచిపోయిన ఆదర్శ గ్రామపంచాయతీ భవనం

కోనరావుపేట, జూలై 17 : కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పంచాయతీ భవన నిర్మాణం నత్తనడకన కొనసాగుతోంది. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ. 20 లక్షలు, ప్రత్యేక నిధులు 30 లక్షలతో ఆదర్శ గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. సదర్ కాంట్రాక్టర్ స్లాబ్ వరకు పనులు చేసి నిలిపివేశారు. దీంతో శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ భవనంలోనే గ్రామపంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ భవనం ఇరుకుగా ఉండటమే కాకుండా కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. అయినా కొత్త భవనం పూర్తిగా నిర్మాణం కాకపోవడంతో పాత గ్రామ పంచాయితీ భవనంలోనే విధులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నత్తనడకన నడుస్తున్న ఆదర్శ గ్రామపంచాయతీ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.